మంత్రి పొంగులేటికి తప్పిన ప్రమాదం

- టైర్లు పేలి అదుపు తప్పిన కారు
- డ్రైవర్ చాకచక్యంతో తప్పిన ప్రమాదం

తిరుమలాయపాలెం, జనవరి 12 : రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఆదివారం రాత్రి తృటిలో ప్రమాదం తప్పింది. హనుమకొండ నుంచి ఖమ్మం వస్తుండగా రాత్రి 8:45 గంటల సమయంలో ఖమ్మంజిల్లా తిరుమలాయపాలెం మండలకేంద్రం సమీపంలో కారు టైరు ఒక్కసారిగా పేలింది. డ్రైవర్ చాకచక్యంగా కారును అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. కారులో నుంచి దిగిన మంత్రి ఎస్కార్ట్ వాహనంలో ఖమ్మం క్యాంపు కార్యాలయానికి వెళ్లిపోయారు.

బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలి

రేవంత్‌రెడ్డికి ఆర్ కృష్ణయ్య లేఖ

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని, ఆ మేరకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేసి చట్టం చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. బీసీ రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కమిషన్ కూడా ఏర్పాటుచేసిందని, మరోవైపు ఇంటింటి సర్వే నిర్వహించిందని వెల్లడించారు. ఆ దిశలోనే చట్టం చేయాలని, రిజర్వేషన్లను పెంచాలని, ఆ తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఆర్ కృష్ణయ్యకు బీసీటీఏ వినతి...

బీసీ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై పార్లమెంట్‌లో లేవనెత్తాలని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్యకు బీసీటీఏ(బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్) నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం బీసీ భవన్‌లో బీసీటీఏ డైరీ, క్యాలెండర్‌ను కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల పదోన్నతుల్లో రిజర్వేషన్లు, క్రీమీలేయర్ విధానం ఎత్తివేత, వేతనంతో కూడిన సెలవుల మంజూరు తదితర అంశాలను పార్లమెంట్‌లో ప్రస్తావించాలని బీసీటీఏ సభ్యులు కోరారు. కార్యక్రమంలో బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నారాయణయాదవ్, కార్యదర్శి రాందాస్ పాల్గొన్నారు.

వైఎస్ బతికున్నా.. 'తెలంగాణ' ఆగేది కాదు

మాజీ ముఖ్యమంత్రి ఎన్ కిరణ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ):దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బతికున్నా.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు మాత్రం ఆగేది కాదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం బీజేపీ నాయకునిగా ఉన్న ఆయన ఆదివారం విజయవాడలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2009 ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్ హైకమాండ్ తమ ముందు తెలంగాణ ఏర్పాటు ప్రతిపాదన పెట్టిందని వెల్లడించారు. తాము దానిని వ్యతిరేకించామని, అయితే వైఎస్ మరణం తర్వాత కూడా తెలంగాణ ఏర్పాటు విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం సానుకూలంగానే ఉన్నదని తెలిపారు. తెలంగాణ ఏర్పాటును అడ్డుకోలేకపోయారన్న అపప్రథ తనపై సరికాదని, వైఎస్ ఉన్నా అడ్డుకోలేకపోయేవారని అన్నారు.

కాంగ్రెస్‌లో వలస పంచాయితీ

- టీడీపీ మాజీఎమ్మెల్యేకు నామినేటెడ్ పదవి?
- పాత, కొత్త నేతల మధ్య పోరు
- చేరగానే నామినేటెడ్ పోస్టులు
- పాత నేతలకు మొండిచెయ్యి
- చైర్మన్ పదవుల్లో తప్పని నిరాశ
- ముఖ్యనేత తెరవెనుక రాజకీయం
- భగ్గుమంటున్న కాంగ్రెస్ శ్రేణులు
- అధిష్ఠానం పెద్దలకు ఫిర్యాదులు

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ కాంగ్రెస్‌లో అసంతృప్తి భగ్గుమంటున్నది. ముఖ్యనేత ఆధిపత్యం మితిమీరుతున్నదని, పార్టీని వలసనేతలతో నింపుతున్నారని పాత కాంగ్రెస్ నేతలు రగిలిపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ రాకపోయినా పార్టీ గెలుపు కోసం కృషి చేశామని, ఇప్పుడు కనీసం నామినేటెడ్ పదువులైనా ఇవ్వకపోతే ఎలా అని నిలదీస్తున్నారు. ఓపిక పడుతున్న కొద్దీ వివక్ష పునరావృతమవుతున్నదని నిప్పులుచెరుగుతున్నారు. కొందరు కొత్త నేతలకు కండువా కప్పుతున్నప్పుడే పదవులు కట్టబెడుతున్నారని రగిలిపోతున్నారు. వీరంతా అధిష్ఠానానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్టు గాంధీ భవన్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

మళ్లీ మొదలైన నామినేటెడ్ లొల్లి

కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల లొల్లి మళ్లీ మొదలైంది. కొత్తగా నియమించే 60 పదవులకు గాను 250 మందికి పైగా పోటీపడుతున్నారు. ఇందులో ఒకట్రెండు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ పదవిని దేవరకద్ర తెలుగుదేశం మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డికి కట్టబెట్టనున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఉద్దేశపూర్వకంగానే ముఖ్యనేతకు అనుకూలమైన మీడియాలో లీకులు కూడా ఇచ్చారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. బాలల హక్కుల కోసం కృషి చేసిన వారికే ఈ పదవి ఇవ్వాలని, సీతాదయాకర్‌రెడ్డికి అర్హత లేదని జయాకర్‌రావు అనే న్యాయవాది అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు.

మేమేం చేశాం నేరం?

ఎన్నికల్లో వలస నేతలకు టికెట్లు ఇచ్చారని, తమకు టికెట్ రాకపోయినా భవిష్యత్‌లో న్యాయం చేస్తామంటే నమ్మామని పాత నేతలు గుర్తుచేస్తున్నారు. ఇప్పటికే బీజేపీ నుంచి వచ్చిన జితేందర్‌రెడ్డికి ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పదవి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు అమిత్‌రెడ్డి తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ పదవి కట్టబెట్టారని చెబుతున్నారు. మాజీమంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి పార్టీలో చేరగానే వ్యవసాయ సలహాదారుడిగా నియమించారని, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి పీఏసీ చైర్మన్ పదవి ఇచ్చారని అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

ఇక మాకు పదవులే ఇవ్వరా?

రాష్ట్రవ్యాప్తంగా గతంలో 37 కార్పొరేషన్ల పదవులు కూడా వలసనేతలతో నింపారని పాత కాంగ్రెస్ నేతలు గుర్రుగా ఉన్నారు. వీటిని రద్దు చేయాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి ఫిర్యాదు చేశానని ఓ సీనియర్‌నేత వెల్లడించారు. తాజాగా చేపట్టనున్న 60 పదవులను కూడా వలసనేతలకు ఇప్పించుకునేందుకు ముఖ్యనేత తెరవెనుక రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ సారి ఊరుకునే ప్రసక్తే లేదని, పాత కాంగ్రెస్ నేతలకు తగిన న్యాయం చేయాల్సిందేనని తేల్చిచెబుతున్నారు.

రాజ్యాంగ స్ఫూర్తి ఇదేనా రాహుల్ జీ?

- సంవిధాన్ బచావో ర్యాలీ చేస్తానంటున్న రాహుల్‌గాంధీ
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని ఉల్లంఘిస్తామంటున్న పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్
- ఎక్స్ వేదికగా రాహుల్‌ను ప్రశ్నించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని కాపాడాలంటూ సంవిధాన్ ర్యాలీ చేస్తానంటుంటే.. పీసీసీ అధ్యక్షుడు మాత్రం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకుని అదే రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తామని ప్రకటిస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని జేబులో పెట్టుకుని తిరిగేది ఇందుకేనా రాహుల్‌గాంధీ? అంటూ ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఈ మేరకు త్వరలో మరింత మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుంటామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రకటించిన పేపర్ క్లిప్పింగ్‌ను కేటీఆర్ ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. రాజ్యాంగ స్ఫూర్తిని ఉల్లంఘిస్తూ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడమేనా మీ సంవిధాన్ బచావో నినాదం అంటూ నిలదీశారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఎంత గొప్పమార్గం ఎంచుకున్నారు రాహుల్ గాంధీ? అంటూ ట్వీట్ చేశారు.

ఐదేళ్ల చిన్నారిపై వృద్ధుడి లైంగికదాడి

కోనరావుపేట, జనవరి 12 : ఐదేళ్ల చిన్నారిపై ఓ వృద్ధుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కోనరావుపేట మండలం కొలనూర్‌లో ఓ చిన్నారిపై అంగన్‌వాడీ ఆయా భర్త అఘాయిత్యానికి పాల్పడ్డాడు. చిన్నారి తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వైద్యులను సంప్రదించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి విచారణ చేపట్టారు. వారం క్రితమే ఘటన జరిగిందని అధికారుల విచారణలో వెల్లడికాగా పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

ఏడేండ్ల బాలికపై లైంగికదాడి

పోలీసుల అదుపులో ముగ్గురు యువకులు

మిర్యాలగూడ, జనవరి 12 : ఏడేండ్ల బాలికపై లైంగికదాడి జరిగిన ఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని తాళ్లగడ్డలో చోటుచేసుకుంది. శనివారం బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అందులో ఇద్దరు మైనర్లు ఉన్నారు. ఈ ముగ్గురితో బాధితురాలి కుటుంబానికి దగ్గరి బంధుత్వం ఉన్నట్టు పోలీసులు ఆదివారం వెల్లడించారు.

మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు రచించిన ఉనిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్లు బండారు దత్తాత్రేయ, కంభంపాటి హరిబాబు, కేంద్రమంత్రి బండి సంజయ్, ఎంపీ లక్ష్మణ్, మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీలు వినోద్‌కుమార్, సుబ్బిరామిరెడ్డి, సీనియర్ జర్నలిస్టు రామచంద్రమూర్తి

పదవుల కోసమే పార్టీలు మారుతున్నరు

- ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి జంప్
- నేను ఫిరాయింపులపై మాట్లాడితే బాగుండదు
- అయినా మాట్లాడాల్సి వస్తున్నది
- సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు
- మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు రచించిన 'ఉనిక' పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): ప్రజాప్రతినిధులు పదవుల కోసమే పార్టీలు మారుతున్నారంటూ పార్టీ ఫిరాయింపులపై సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీలతో సంబంధం లేకుండా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి జంప్ అవుతున్నారని పేర్కొన్నారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు రచించిన 'ఉనిక' పుస్తకాన్ని హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... 'నేను ఫిరాయింపులపై మాట్లాడితే బాగుండదు. అయినా మాట్లాడాల్సి వస్తున్నది. విద్యార్థి రాజకీయాల్లో సైద్ధాంతిక క్రియాశీలత లోపించినందునే ఇలాంటి నాయకత్వం తయారవుతున్నది. పదవుల కోసం అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీలోకి మారుతున్నరు' అని వ్యాఖ్యానించారు. అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న హైదరాబాద్ పోటీ పడేది ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతితో కాదని.. న్యూయార్క్, టోక్యోలతో అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో మూడుసార్లు బీజేపీ అధ్యక్షుడిగా, కేంద్రమంత్రిగా, తమిళనాడు, మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేసిన విద్యాసాగర్‌రావును అలా పిలిస్తే తనకు దూరమనుకుంటారని, అందుకే ఆయనను సాగర్‌జీ అని సంబోధిస్తున్నానని పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణకు గోదావరి జలాలు తెచ్చేందుకు మొదట విద్యాసాగర్‌రావు, దేవేందర్‌గౌడ్ పాదయాత్ర చేశారని, ఆ తర్వాతే రాజశేఖర్‌రెడ్డి ప్రాణహిత, చేవేళ్ల ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకున్నారని చెప్పారు. గోదావరి జలాలను సంపూర్ణంగా వినియోగించుకునేందుకు సాగర్‌జీ సహకారం కావాలని కోరారు. తమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం కోసం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. మెట్రో విస్తరణ, గ్రీన్‌ఫీల్డ్ హైవే, డ్రైపోర్ట్, కాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ సహకరించాలని విన్నవించారు. ఇందుకు బీజేపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ముందుకురావాలని కోరారు.

ప్రభుత్వమంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలే కాదు..

ప్రభుత్వమంటే కాంగ్రెస్‌కు చెందిన 65 మంది ఎమ్మెల్యేలే కాదు.. ప్రతిపక్షానికి చెందిన ఎమ్మెల్యేలు కూడా కలిస్తేనే ప్రభుత్వమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపడం ప్రతిపక్షం బాధ్యత అని చెప్పారు. హైదరాబాద్‌లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణానికి మేఘా సంస్థ కృషి చేస్తుందని పేర్కొన్నారు. తనకు ఎలాంటి భేషజాలు లేవని, రాష్ట్రాభివృద్ధికి బీజేపీ నాయకుల సహకారం తీసుకుంటానని చెప్పారు.

17 నుంచి సీఎం విదేశీ పర్యటన

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): ఈ నెల 17 నుంచి 23 వరకు సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన చేయనున్నట్టు సీఎంవో ఆదివారం ప్రకటించింది. 17న సీఎం బృందం హైదరాబాద్ నుంచి బయల్దేరుతుంది. 18న సింగపూర్ చేరుకొని షాపింగ్ మాల్స్, స్టేడియాల నిర్మాణాల పరిశీలన అనంతరం పారిశ్రామికవేత్తలతో సీఎం సమావేశం కానున్నారు. 19న సింగపూర్ నుంచి స్విట్జర్లాండ్ దావోస్‌కు వెళ్తారు. 23న వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో పాల్గొని స్వదేశానికి తిరుగు పయనమవుతారు.

కాంగ్రెస్‌కు చెప్పే ధైర్యం లేదు.. వారూ చెప్పకోలేరు

ఆ 10 మంది ఎమ్మెల్యేలను చూస్తే జాలేస్తున్నది : కేటీఆర్

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): 'కాంగ్రెస్‌కు చెప్పే ధైర్యం లేదు. .వారు చెప్పుకోలేరు. పార్టీ మారిన ఆ 10 మంది ఎమ్మెల్యేలను చూస్తే జాలేస్తున్నది' అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్‌వేదికగా పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆదివారం జరిగిన జరిగిన సమీక్షా సమావేశంలో జగిత్యాల ఎమ్మె ల్యే సంజయ్ ఏ పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారో చెప్పుకోలేని దయనీయస్థితి నెలకొన్నదని విమర్శించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఉమ్మడి కరీంనగర్ వేదిక సాక్షిగా ఎమ్మెల్యే సంజయ్‌ను నిలదీసిన వైనాన్ని కేటీఆర్ అభినందించారు.

అలిశెట్టికి కేటీఆర్ నివాళి

తెలంగాణ మట్టివాసనలు, మానవత్వపు పరిమళానికి నిట్టనిలువు ప్రతీక ప్రముఖ కవి, రచయిత అలిశెట్టి ప్రభాకర్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. 'మరణం నా చివరి చరణం కాదు/ మౌనం నా చితాభస్మం కాదు.., నిర్విరామంగా, నిత్యనూతనంగా / కాలం అంచున చిగురించే / నెత్తుటి ఊహను నేను' అని ప్రకటించిన ధీశాలి అలిశెట్టి అని కొనియాడారు. అలిశెట్టి జయంతి, వర్ధంతి సందర్భంగా కేటీఆర్ ఎక్స్‌వేదికగా ఘన నివాళి అర్పించారు.

మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నేతలు తమ్మినేని వీరభద్రం, రాఘవులు

రేవంత్ ప్రభుత్వానివి ప్రజావ్యతిరేక నిర్ణయాలు

- ఫార్మాసిటీ, ఫోర్త్‌సిటీ, హైడ్రా పేరిట పేదల ఇండ్లు కూల్చివేత
- మేం ప్రభుత్వానికి మిత్రపక్షం కాదు
- ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై త్వరలో పోరాటం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

హైదరాబాద్, జనవరి 12 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరుగనున్న సీపీఎం 4వ మహాసభల పోస్టర్‌ను హైదరాబాద్‌లోని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులుతో కలిసి ఆయన విడుదల చేశారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ.. ఫార్మా సిటీ, ఫోర్త్ సిటీ, హైడ్రా పేరుతో పేదల ఇండ్లను రాష్ట్ర ప్రభుత్వం కూల్చుతున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలో నిర్బంధం పెరిగిందని, కాంగ్రెస్ ఏడో వాగ్దానమైన స్వేచ్ఛ అమలు కావడం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒకటి, రెండు మినహా మిగతావి అమలు చేయలేక పోయారని విమర్శించారు. తాము ప్రభుత్వానికి మిత్రపక్షం కాదని స్పష్టంచేశారు. పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు మాట్లాడుతూ..కేంద్రం తెచ్చిన లేబర్ కోర్టు రూల్స్ అమలు చేయమని సీఎంరేవంత్‌రెడ్డి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు బడ్జెట్‌లో 25 శాతం పెంచాలని కోరారు.

నదుల స్వాధీనం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం

ప్రొఫెసర్ జీ హరగోపాల్

చిక్కడపల్లి, జనవరి 12: ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గోదావరి-కృష్ణా నదుల స్వాధీన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని, ఆ ఉత్తర్వుల రద్దు కోసం రాష్ట్ర ప్రభుత్వం పోరాడాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ జీ హరగోపాల్, కన్వీనర్ ఎం రాఘవాచారి, వేదిక ప్రతినిధి రాజేంద్రబాబు, సీపీఐ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి, శాస్త్రవేత్త బాబురావు, ఇం జినీర్ రామకృష్ణారెడ్డి, సీపీఐ(ఎంఎల్) నాయకుడు గోవర్ధన్, ప్రొఫెసర్ విజయ్, లక్ష్మయ్య తదితరులు రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరయ్యారు.

స్వామివివేకానందకు నివాళి

తెలంగాణ భవన్‌లో ఆదివారం స్వామివివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న శాసనమండలిలో ప్రతిపక్షనేత మధుసూదనచారి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, పల్లె రవిగౌడ్, కిశోర్‌గౌడ్, మన్నె గోవర్ధన్ తదితరులు

హైడ్రాకు సుమోటో కేసులు పెట్టే అధికారం!

- సంక్రాంతి తర్వాత ప్రత్యేక పోలీస్ స్టేషన్ కార్యకలాపాలు
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుకు హైడ్రా కమిషనర్ ప్రతిపాదనలు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి తర్వాత దూకుడు మరింత పెంచేందుకు హైడ్రా సిద్ధమవుతున్నది. ఇప్పటివరకు ఫిర్యాదుల ఆధారంగా చర్యలు తీసుకుంటున్న హైడ్రా సుమోటోగా కేసులు పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నది. ఈ మేరకు సంక్రాంతి తర్వాత హైడ్రా ప్రత్యేక పోలీస్ స్టేషన్ కార్యకలాపాలు అందుబాటులోకి రానున్నాయని తెలుస్తున్నది. రాణిగంజ్‌లోని బుద్ధభవన్‌లో హైడ్రా కార్యాలయం బి-బ్లాక్‌లో అధికారులు పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఏసీపీ స్థాయి అధికారి స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా ఉంటారు. సాధారణంగా వచ్చే ఫిర్యాదులే కాకుండా హైడ్రా దృష్టికి వచ్చిన ఆక్రమణలపై ఆధారాలుంటే సుమోటోగా కేసులు నమోదు చేయనున్నట్టు అధికారులు తెలిపారు. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, చెరువుల ఆక్రమణలపై సీరియస్‌గా ఫోకస్ చేసేలా ప్రణాళికలు రచించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. హైడ్రాకు అనుబంధంగా ఓ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి రంగనాథ్ ప్రతిపాదనలు పంపినట్టు తెలుస్తున్నది. హైడ్రా ఆధ్వర్యంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిని సంక్రాంతి సందర్భంగా నేడు రద్దు చేస్తున్నామని హైడ్రా అధికారులు తెలిపారు. వచ్చే సోమవారం నుంచి యథావిధిగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి

- 9 లక్షలు అప్పు చేసిన ప్రశాంత్
- ఉరి వేసుకుని ఆత్మహత్య
- మెదక్ జిల్లాలో విషాదం

ప్రశాంత్ (ఫైల్)

రామాయంపేట, జనవరి 12 : ఆన్‌లైన్ బెట్టింగ్‌లో భారీగా డబ్బులు కోల్పోయి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని శామీర్‌పేట చౌరస్తా వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయిలాపూర్‌కు చెందిన చాకలి ప్రశాంత్ (25) మేడ్చల్ జిల్లా శామీర్‌పేట సర్కిల్‌లోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఇంటికి డబ్బులు పంపించకుండా పెట్రోల్ బంకులోనే ఉంటూ ఆన్‌లైన్ బెట్టింగ్ కడుతున్నాడు. బెట్టింగ్‌లో సుమారు రూ.7.50 లక్షలు కోల్పోయాడు. పని చేస్తున్న బంకులో మరో రూ.1.50 లక్షలు అప్పు చేశాడు. మొత్తం అప్పు రూ.9 లక్షలకు చేరుకున్నది. వీటిని తీర్చే మార్గం లేక ఆందోళనకు గురైన ప్రశాంత్ శామీర్‌పేటలోనే రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

17.79 లక్షలు చోరీ

కామారెడ్డి జిల్లా పిట్లంలో ఘటన

పెద్దకొడప్‌గల్, జనవరి 12: కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని ఏటీఎం నుంచి దుండగులు రూ.17.79 లక్షలను ఎత్తుకెళ్లారు. పోలీసుల వివరాల ప్రకారం.. పిట్లం మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా పెద్దకొడప్‌గల్- బిచ్కుందకు వెళ్లే మార్గంలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలోకి శనివారం రాత్రి 3 గంటల ప్రాంతంలో ముసుగుతో వచ్చిన దుండగులు గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసి రూ.17.79 లక్షలను ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలాన్ని అడిషనల్ ఎస్పీ చైతన్యారెడ్డి, డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రాజేశ్వర్ ఆదివారం పరిశీలించారు. ఏటీఎం సూపర్‌వైజర్ రాచర్ల ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై రాజు తెలిపారు.

ఉద్యోగ విరమణ వయస్సు పెంపు సరికాదు

- లక్షల మంది నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టడమే
- ఆ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి
- లేకుంటే ప్రభుత్వానికి, కాంగ్రెస్‌కు భారీ నష్టం తథ్యం
- జాతీయ ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ రామకృష్ణ

టీపీసీసీ ప్రెసిండెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఓబీసీ ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ ఆళ్ల రామకృష్ణ

రవీంద్రభారతి, జనవరి 12: ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 63 సంవత్సరాలకు పెంచడం రాష్ట్ర ప్రభుత్వానికి శ్రేయస్కరం కాదని, దీని వల్ల ప్రభుత్వంతోపాటు కాంగ్రెస్ పార్టీకి తీరని నష్టం వాటిల్లుతుందని జాతీయ ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ ఆళ్ల రామకృష్ణ హెచ్చరించారు. ఉద్యోగ విరమణ వయసును పెంచడమంటే లక్షల మంది నిరుద్